క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ భాస్కర్



పొన్నూరు: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహన డ్రైవర్లు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పొన్నూరు పట్టణ సీఐ పి.భాస్కర్ కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్లో ఆటో, కారు, లారీ డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన పలు సూచనలు చేశారు. రద్దీ ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలు నిలుపరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా హారన్ మోగించరాదని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే విధంగా చేసేవారిపై కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. తొలిసారి నిబంధనలు తప్పక పాటించాలని వాహన డ్రైవర్లకు సూచించారు.

ఆర్వీఆర్జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



రమేష్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు వారి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆర్వీఆర్జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకుడు సాధినేని రమేష్‌బాబుకు బెళగానికి చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఏ మినిమైచరైజెడ్ హెల్తీ ఐసోలేటెడ్ ఫిల్టరింగ్ అల్ట్రా వైట్ బ్యాండ్ రీకానిగరేబల్ మైమీ యాంటెన్నా ఫర్ వైర్ లెస్ అప్లికేషన్స్ అనే అంశంపై చార్య పీ దినేష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.రంగబాబులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



పొన్నూరు: ఆర్టీసీ ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించడంతోపాటు, ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించే విధంగా ప్రభుత్వం బహుమతులు కూడా అందజేస్తున్నట్లు పొన్నూరు డిపో మేనేజర్ అజిత కుమారి పేర్కొన్నారు. సోమవారం డిపో పరిధిలో బస్సులలో ప్రయాణించిన పలువురికి లక్కీడీప్ ద్వారా బహుమతులు అందజేశారు. సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బస్సులో ప్రయాణం చేసి దిగే సమయంలో ప్రయాణికులు టికెట్‌పై తమ సెల్ నంబర్, పేరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ఆ టికెట్లను ప్రతినెల 1, 16 తేదీలలో డ్రా తీసి విజేతలైన ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం

నెహ్రూ నగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో 42 ఎంఎల్‌డీ ఫిల్టరేషన్ ప్లాంట్ వార్షిక మరమ్మతుల నిమిత్తం 21వ తేదీన తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు గుంటూరు నగరంలోని బి.ఆర్.స్టేడియం, ఐ.పి.డి. కాలనీ, శ్రీనివాసరావు పేట, నల్లచెరువు, తారకరామా నగర్, ఆటోనగర్ ప్రాంతాలలో తాగు నీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగర ప్రజలు గుంటూరు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చల్లావారిపాలెంకు చెందిన లక్కిరెడ్డి శివరామకృష్ణ నగరంలోని కంకరగుంట సమీపంలోని ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. షాపులోని మద్యం బాటిళ్లను అక్రమంగా ఇంటికి తరలించి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రామకృష్ణారెడ్డి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 133 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోనే దళితులకు ప్రాధాన్యం

- పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- ప్రత్తిపాడులో ఆత్మీయ సమావేశం



బలసాని కిరణ్‌కుమార్‌ని గజమాలతో సత్కరిస్తున్న ఎస్సీ ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీలోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యం ఉందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని పమిడి వారి గ్రౌండ్‌లో ప్రత్తిపాడు మండల ఎస్సీల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. తొలుత స్థానిక బస్టాండు సెంటరులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలతో కలసి ద్విచక్రవాహనాల ర్యాలీగా సభాస్థలి వద్దకు చేరుకున్నారు. జైజగన్.. జైజై జగన్, వర్ధిల్లాలి బలసాని నాయకత్వం అంటూ సభా ప్రాంగణంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో రాజకీయంగా దళితులకు అత్యంత ప్రాధాన్యం దక్కింది ఒక్క వైఎస్సార్ సీపీలోనేనని పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన దళిత బిడ్డలను అత్యున్నత చట్టసభలకు పంపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. గతంలో అనేక రాజకీయ పార్టీలను దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూసేవని, కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యుల్లా చూస్తూ అన్ని రంగాల్లోనూ అగ్రస్థానం కల్పిస్తున్నారన్నారు. ఎన్నికల్లో దళిత బిడ్డలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోసారి జగన్‌మోహన్ రెడ్డితో పాటు తనను ఆశీర్వదించాలని బలసాని కోరారు. మీకు ఏ సమయంలోనైనా అండగా ఉంటానని, మీకు ఏ కష్టం వచ్చినా ముందు నేను నిలబడతానని సభావేదిక సాక్షిగా చెప్పారు.

చర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన

క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంలో నూతనంగా నిర్మించనున్న ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి సోమవారం సంగ పెద్దల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలసాని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

తెనాలి డీఎస్పీ రమేష్



వివరాలు వెల్లడిస్తున్న తెనాలి డీఎస్పీ రమేష్

చేబ్రోలు: గంజాయి తరలించటం, విక్రయించేవారిపై కఠిన చర్యలు తప్పవని తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం గంజాయి స్వాధీనం వివరాలు సోమవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ ఫజల్, పొన్నూరు రూరల్ మండలం కట్టింపూడి గ్రామానికి చెందిన నున్న యశ్వంత్‌లతో పాటు పొన్నూరు పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలుడు గంజాయి తాగటానికి అలవాటు పడి గత కొంత కాలంగా గంజాయిని చీరాల రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసి తాగుతున్నారు. గంజాయి అమ్మేవారు రాకపోవటంతో యడ్లపాడు మండలం బోయపాలెంలో ఆంజనేయస్వామి బొమ్మ వద్ద బడ్డీ కొట్టు నడుపుతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన సరబోల రమాకాంత్, ఆశిస్ కుమార్ పాండాలు గంజాయి అమ్ముతున్నారని తెలుసుకొని వారి వద్దకు వెళ్లి గంజాయిను కొనుగోలు చేసి కొంత తాగుతూ మిగిలింది అధిక రేటుకు పొన్నూరు రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి డబ్బు సంపాదిస్తున్నారు. 18వ తేదీన షేక్ ఫజల్, నున్న యశ్వంత్ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై బోయపాలెం వెళ్లి అక్కడ రమాకాంత్, అశీష్‌కుమార్ పాండేల వద్ద నుంచి రూ.30వేల విలువ చేసే ఒక కిలో గంజాయిని కొని పొన్నూరుకు తరలించారు. బాలుడు మరో ముగ్గురు కలిసి గంజాయిని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు గంజాయిని విక్రయించాలని నిర్ణయించుకొని బైక్‌పై పొన్నూరు నుంచి చేబ్రోలుకు వస్తున్నారు. పోలీసులకు సమాచారం అందటంతో పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి. మహేష్‌కుమార్ సిబ్బంది కొమ్మమూరు ఛానల్ వంతెన వద్ద వారిని అదుపులోకి తీసుకొని వీరి నుంచి గంజాయిని, బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు బాధ్యులైన ఫజల్, యశ్వంత్, రమాకాంత్, అశీక్‌కుమార్ పాండేలతో పాటు బాలుడుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. నిందితులను పట్టుకోవటంతో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బందిని అభినందించారు.

వీవీఐటీలో ఈటీఎల్ సాంకేతికతపై సదస్సు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఏసీఎం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈటీఎల్ (ఎక్స్ట్రాక్, ట్రాన్స్‌ఫాం, లోడ్) టెక్నాలజీ, నాణ్యత, నియంత్రణ ఇంజినీర్లకు కెరియర్ అవకాశాలపై సదస్సు సోమవారం నిర్వహించారు. బహుళ జాతీయ సంస్థ ఎస్ అండ్ పీ గ్లోబల్ అసోసియేట్ డైరెక్టర్ కసెట్టి అమర్ హాజరై మాట్లాడుతూ ఈటీఎల్ టెక్నాలజీ అనేది డేటాను పెద్ద మొత్తంలో సమీకరించి మనకు అనుకూలంగా మలచుకుని డేటాను విశ్లేషించడానికి ఎక్కువగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సాంకేతికత ద్వారా సులభంగా మార్కెట్ డిమాండ్, అంచనా, వినియోగదారుల ప్రవర్తన, కస్టమర్ ఫీడ్‌బ్యాక్, విక్రయ కేంద్రాల నుంచి డేటా విశ్లేషణకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈటీఎల్ సాంకేతికతకు మంచి ఆదరణ లభిస్తుందని, వ్యాపార ప్రయోజనాలు అధికంగా ఉండటం వలన విస్తృత అవకాశాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.రామచంద్రన్ పాల్గొన్నారు.

నంబూరులో ఉరివేసుకుని ఒకరి మృతి

పెదకాకాని: ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్న ఘటన నంబూరులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని నంబూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మంచాల ప్రవీణ్‌కుమార్‌కు సూర్యలేఖతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి పాప, బాబు సంతానం. ప్రవీణ్‌కుమార్ కార్పెంటర్‌గా పనిచేస్తుండగా భార్య సూర్యలేఖ నాలుగు నెలల నుంచి కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఆదివారం భార్యాభర్తల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. అనంతరం భర్త ఇంటిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య ఉరివేసుకుని వేలాడుతున్న భర్తను కిందికి దించి చుట్టుపక్కల వారి సహాయంతో చినకాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ప్రవీణ్‌కుమార్(39) అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పెదకాకాని సీఐ కె.వీరాస్వామి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రత్నారెడ్డి మృతదేహం

ప్రత్తిపాడు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన యరబ్రోతుల రత్నారెడ్డి (27) స్థానిక పైనీ అగ్రోస్ పురుగుమందుల దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తూ, తనకున్న మూడెకరాల సొంత పొలంలో మిర్చి, మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. పంట సాగుకు పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. పంటలో ఆశించిన దిగుబడులు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలోనని గత కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం పొలంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు ప్రత్తిపాడులోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి తల్లి యరబ్రోతుల రమాదేవి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పులు మొత్తం సుమారు రూ.18 లక్షల మేర ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పొన్నూరు: నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి 98–99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదివిన పాఠశాలను గుర్తుంచుకోని, ఉపాధ్యాయులను గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలో మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహమ్మద్ హక్, కుమారి, గాలయ్య, శివరామకృష్ణ, లీలాకృష్ణ, శ్రీదేవి, నాగమణి, ఎస్పీ ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులను పరిష్కరించాలి

డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: స్పందనలో అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం జరిగేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో డెప్యూటీ కమిషనర్ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియచేయాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ముందు తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని కోరారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 36 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్ఏసీ) సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సమక్షంలో వైఎస్సార్ సీపీలో జనసేన, బీసీ కాలనీ ప్రజలు

వైఎస్సార్ సీపీ హయాంలోనే ఉప్పలపాడుకు తాగునీరు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- జనసేన నుంచి 150 మంది చేరిక

పెదకాకాని: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యమైందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన 150 మంది జనసేన, బీసీ కాలనీకి చెందిన ప్రజలు సోమవారం రాత్రి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సమక్షంలో పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలతో పార్టీలో చేరుతున్న వారిని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వం సమస్యను గాలికి వదిలేసిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ప్రజలు తాగునీటి సమస్యను తీసుకెళ్లి కార్పొరేషన్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఏళ్ల తరబడి రెండు గ్రామాల ప్రజలు తాగునీరు కొనుక్కుని తాగుతున్నా ఏనాడూ గత ప్రభుత్వానికి ప్రజల సమస్యను పరిష్కరించాలనే ఆలోచన రాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలనపై ఆకర్షితులై స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. పార్టీలో చేరిన వారిలో జనసేన పార్టీ, బీసీ కాలనీలకు చెందిన 150 మంది ఉన్నారు. కార్యక్రమంలో శివాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు పల్లెంపాటి శ్రీనివాసరావు, చెన్నుపాటి కళ్యాణ్, పసుపులేటి శ్రీను, చెన్నుపాటి శివమ్మ పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సతో బ్రెయిన్ ట్యూమర్ తొలగింపు

- సకాలంలో స్పందించి ట్యూమర్ తొలగించిన వైద్యులు
- రోగికి సంజీవనిగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం



ఆపరేషన్ అనంతరం మణికంఠతో వైద్యులు

గుంటూరు మెడికల్: బ్రెయిన్‌లో ట్యూమర్‌తో బాధపడుతూ అపస్మారక స్థితిలో చికిత్స కోసం వచ్చిన ఓ యువకుడికి అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి వైద్యులు ప్రాణాలు కాపాడారు. రోగి మెలుకువగా ఉండగానే 'అవేక్ బ్రెయిన్ సర్జరీ' చేసి అరుదైన రికార్డు సృష్టించారు. యువకుడికి ఎంతో ఇష్టమైన శ్రీరాముడి అయోధ్య విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ రోగి బ్రెయిన్ నుంచి కణితిని తొలగించి నూతన జీవితాన్ని ప్రసాదించారు. బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి సోమవారం గుంటూరు అరండల్‌పేటలోని సాయి హాస్పటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో అరుదైన ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన దానబోయిన మణికంఠ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు కొంత కాలంగా ఫిట్స్ వస్తుంది. మూర్ఛవల్ల అతను తన ఆటోను సక్రమంగా నడపలేక జీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు అతడికి గుంటూరు, హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫిట్స్ తగ్గలేదు. గతేడాది డిసెంబరు 29న తీవ్రంగా ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స కోసం తమ వద్దకు వచ్చారని బ్రింద న్యూరో సెంటర్ చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి చెప్పారు. వైద్య పరీక్షలు చేసి మెదడులో కుడివైపు కుడిచెయ్యి, గొంతు, నాలుక, దంతాలు, దవడ, మాటలు వచ్చే భాగం, ముఖానికి నరాలు సరఫరా చేసే మెదడులోని భాగంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. జీన్స్‌లో తేడా వల్ల ఇలాంటి ట్యూమర్లు బ్రెయిన్‌లో వస్తాయని, సకాలంలో ఆపరేషన్ చేసి తొలగించని పక్షంలో యువకుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆపరేషన్ చేసే సమయంలో సైతం ఏమాత్రం తేడా వచ్చినా కాలు, చెయ్యి పడిపోవడంతో పాటు మాట కూడా పడిపోతుందని గుర్తించామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రోగి మెలుకువలో ఉండగానే అవేక్ బ్రెయిన్ సర్జరీ చేయాలని నిర్ధారించామన్నారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో యువకుడికి ఎంతో ఇష్టమైన అయోధ్య బలరాముడి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ ఈ నెల 11న సుమారు రెండు గంటల సేపు రోగి మెలుకువగా ఉండగానే ఆపరేషన్ చేశామన్నారు. యువకుడి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సుమారు రూ.5 లక్షల ఖరీదు చేసే అరుదైన ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతో పాటుగా మత్తు వైద్య నిపుణులు డాక్టర్ త్రినాథ్, న్యూరో సర్జన్ డాక్టర్ ఆకాష్, వైద్య సిబ్బంది శ్రీను, నరేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నట్లు వెల్లడించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకున్నానని, నూతన జీవితాన్ని ప్రసాదించిన వైద్యులకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రోగి దానబోయిన మణికంఠ కృతజ్ఞతలు తెలిపాడు.

సోమసుందరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేటలోని శ్రీగంగా మీనాక్షి సోమసుందర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. గోపూజ, దేవాలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమశాలలో గణపతి హోమం, వేదోక్తంగా చేశారు. ఉపాలయాల్లో మూర్తులకు అభిషేకాలు కనులపండువగా నిర్వహించారు. మండప పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ 20వ తేదీ నవ చండీపారాయణ, చండీహోమం, సామూహిక లలిత సహస్రనామ పారాయణం జరుగుతాయని పేర్కొన్నారు. 21న మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, బిళ్వార్చన చేస్తారన్నారు. మండ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 22న రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శాంతి కల్యాణం వైభవంగా జరుగుతోందన్నారు. 23న స్వామివారు, అమ్మవార్లకు నందివాహన సేవ, అన్న ప్రసాద వితరణ జరుగతాయని చెప్పారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవానిరతిని కలిగి ఉండాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఉచిత వైద్య అవగాహన సదస్సు, పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలకు రక్త పరీక్షలు, బరువు, ఎత్తు, ఏ వయస్సులో ఏవిధంగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి, ఆహార నియమాలు వివరించారు. అదే విధంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ వి.రవిశంకర్ రెడ్డి, డీపీఓ డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీ నాగరాజు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో లైసెన్స్ హక్కుల వేలం

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2024 –2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ లైసెన్స్ హక్కులకు రెండవ విడత మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. శివాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఈ– టెండరు, సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.